# ఇండియన్ హిస్టరీ - మాదిరి ప్రశ్నలు - జవాబులు

**ప్ర:** గాంధీ శకం (1920-47) ప్రాముఖ్యాన్ని వివరించండి?

**జ:** జాతీయోద్యమంలో ఎంతో విశిష్టతను సంతరించుకున్న దశ గాంధీ శకం (1920-47). ఈ దశలోని పరిణామాలే స్వాతంత్ర్యానికి, విభజనకు కారణమయ్యాయి. వామపక్ష, కార్మిక, కర్షక ఉద్యమాలు తలెత్తి జాతీయోద్యమాన్ని ప్రభావితం చేశాయి. జాతీయోద్యమ సిద్ధాంతాల్లో, పద్ధతుల్లో వినూత్న మార్పులు సంభవించాయి. ఇవే కాకుండా గాంధీ శకం ప్రత్యేకతలు మరెన్నో అవి..

- జాతీయోద్యమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లిన కీలక దశ. అప్పటి వరకు ప్రధానంగా పట్టణ మధ్య తరగతి వర్గానికే పరిమితమైన ఉద్యమం సామాన్య ప్రజలకు చేరుకుంది. వారు విశేష సంఖ్యలో ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించారు.
- 1920 నుంచి 47 మధ్య జాతీయోద్యమం దాదాపు గాంధీ నిర్దేశకత్వంలోనే నడిచింది. అతివాదులు, మితవాదులు కమ్యూనిస్టులు, సోషలిస్టులు గాంధీ నాయకత్వాన్ని తప్పనిసరి అంశంగా ఆమోదించారు. ఫలితంగానే ఎన్నో సార్లు చీలిపోయే ప్రమాదాలు ఎదుర్కొన్న కాంగ్రెస్ గాంధీ ఆధ్వర్యంలో సమైక్యంగా నిలబడగలిగింది.
- జాతీయోద్యమ సిద్ధాంతాల్లో పురోగతి కనిపించింది. 1920కి ముందు 'స్వరాజ్' భావన అస్పష్టంగా ఉంది. కానీ ఈ దశలో కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్‌ను డిమాండ్ చేయడమే కాకుండా స్వాతంత్ర్యం అంటే రాజకీయ స్వేచ్ఛతోపాటు సాంఘిక, ఆర్థిక, స్వాతంత్ర్యం అని గుర్తించారు. ప్రాథమిక హక్కులు, కార్మిక కర్షక హక్కులు సార్వత్రిక వయోజన ఓటు హక్కు వంటి పురోగమ అంశాలెన్నింటినో కాంగ్రెస్ చేపట్టింది.
- రష్యా విప్లవ ప్రభావంతో వామపక్ష ఉద్యమం మొదలైంది. సీపీఐ, సీఎస్‌పీ వంటి వామపక్ష పార్టీలు కాంగ్రెస్‌ను వామపక్షం వైపు మళ్లించేందుకు ప్రయత్నించారు. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి నేతలు కాంగ్రెస్‌లో వామపక్ష భావాలను ప్రోత్సహించారు. చివరకు వామపక్ష ఉద్యమాల ప్రభావంతో గాంధీ కూడా 'దున్నే వాడిదే భూమి' అనే నినాదాన్ని సమర్థించారు.
- జాతీయోద్యమానికి సమాంతరంగా వర్గ స్పృహ పెరిగి కార్మిక, కర్షక సంస్థలు ఆవిర్భవించాయి. ఏఐటీయూసీ, ఆల్ ఇండియా కిసాన్ సభ వంటి సంస్థలు వర్గ చైతన్యానికి ప్రతి రూపాలు. పెరుగుతున్న వర్గ చైతన్యాన్ని జాతీయోద్యమంలో కలిపేసేందుకు కాంగ్రెస్ కరాచీ తీర్మానం (1931)లో కార్మిక, కర్షక హక్కుల గురించి మాట్లాడింది. 1936లో ఫైజ్‌పూర్‌లో వ్యవసాయ కార్యక్రమ తీర్మానం చేసుకుంది.
- గాంధీ చొరవతో మహిళలు జాతీయోద్యమంలో విశేషంగా పాల్గొనడంతో మహిళా విమోచనకు దారి తీసింది. 1920కి ముందు మహిళలకు ఓటు హక్కు డిమాండ్ చేయని కాంగ్రెస్ సార్వత్రిక వయోజన

ఓటు హక్కును డిమాండ్ చేసింది. 1930లలో ఏర్పాటైన అఖిల భారత మహిళా సదస్సు పెరుగుతున్న మహిళా చైతన్యానికి ప్రతీక.

- జాతీయోద్యమం ఆందోళన రూపాల దృష్ట్యా ఎంతో పురోగమించింది. గాంధీ ప్రభావంతో ఎన్నో శాంతియుత ఆందోళన పద్ధతులు ప్రచారంలోకి వచ్చాయి. నిరాహార దీక్షలు, పాదయాత్రలు, సత్యాగ్రహ శిబిరాలు వంటి అంశాలు విస్తృత ప్రచారం పొందాయి.
- ఖాదీ జాతీయ యూనిఫాం మారింది. ఈ అంశాలన్నీ ఇప్పటికీ ప్రజాజీవితంలో ఎంతో ప్రాముఖ్యం కలిగుంటున్నాయి.
- మతతత్వ ధోరణలు ప్రబలి ఉద్యమ స్థాయికి చేరాయి. కాంగ్రెస్ మతతత్వ శక్తులను సైద్ధాంతికంగా, క్షేత్రస్థాయిలో ఎదుర్కోవడంలో చూపిన నిర్లక్ష్యమే దేశ విభజనకు కారణమైంది.
- దళితుల్లో రాజకీయ చైతన్యం మొదలై దేశ వ్యాప్తంగా ఎన్నో దళిత సంస్థలు ఆవిర్భవించాయి. కాంగ్రెస్ భావజాలాన్ని, పద్ధతుల్ని విమర్శించాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక రాజకీయ హక్కులు కావాలని చేసిన పోరాటం సంచలనం సృష్టించింది. ఈ దశలోనే అస్పృశ్యులను జాతీయోద్యమం వైపు ఆకర్షించడానికి గాంధీ హరిజనోద్యమం నిర్వహించారు. ఎందరో అస్పృశ్యులు గాంధీ ప్రభావంతో కాంగ్రెస్ ఉద్యమంలో మమేకం కావడం కూడా జరిగింది.

**ప్ర: భారతేదశంలో దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తులు, సంస్థల పాత్రను చర్చిస్తూ భారతదేశంలో దళితోద్యమ ప్రస్థానాన్ని వివరించండి?**

**జ:** భారతదేశంలో దళితోద్యమ భావాలకు బీజం వేసిన వ్యక్తి జ్యోతిబాపూలే. ఆయన తొలిసారి అస్పృశ్యుల కోసం ప్రత్యక్షంగా పాఠశాలను ఏర్పాటు చేశాడు. భారతదేశంలోని నిమ్న కులాల వారే నిజమైన ఆదివాసులని, ఆర్యులు విదేశీయులనే సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. చరిత్రను, పురాణాలను విభిన్నంగా వ్యాఖ్యానిస్తూ భారతదేశంలో బలి చక్రవర్తి రాజ్యం రావాలని ఆకాంక్షించాడు. పూలే ప్రచారం చేసిన అంశాలన్నింటినీ తదుపరి కాలంలో దళిత నాయకులు స్వీకరించి సిద్ధాంతీకరించారు.

కేరళలలో అస్పృశ్యులైన ఎఝువలను చైతన్యం చేస్తూ నారాయణ గురు నడిపిన ఉద్యమం సంచలనం సృష్టించింది. డాక్టర్ పల్పు వంటి వారు ఈ ఉద్యమాన్ని కొనసాగించారు.

పూలే అనంతరం కొల్హాపూర్ రాజు సాహు మహారాజ్ సత్యశోధక్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాడు. బ్రాహ్మణాధిక్యాన్ని నిరసిస్తూ వెనుకబడిన తరగతులతోపాటు అస్పృశ్యులకు కూడా సామాజిక న్యాయం సాధించేందుకు తన రాజ్యంలో రిజర్వేషన్లు అమలు చేశాడు. తన రాజ్యంలో అస్పృశ్యతను నిషేధిస్తూ చట్టం చేశాడు. సాహు స్ఫూర్తితో ఇతర సంస్థానాధీశులు కూడా (ఉదా: మైసూర్, నిజాం) దళితుల అభ్యున్నతికి కృషి చేశారు.

20 శతాబ్ధంలో బి.ఆర్ అంబేద్కర్ దళిత జాతుల్లో గొప్ప రాజకీయ చైతన్యాన్ని కలిగించాడు. వారికి ప్రత్యేక రాజకీయ హక్కులు ఉండాలని రౌండ్ టేబుల్ సదస్సులో వాదించి కమ్యునల్ అవార్డ్ ద్వారా

సాధించాడు. అయితే గాంధీ ఆమరణ నిరాహారదీక్ష వల్ల అంబేద్కర్ పూణా ఒప్పందాన్ని ఆమోదించాల్సి వచ్చింది. దళితుల అభ్యున్నతికి మహద్, నాసిక్ లాంటి చోట్ల సత్యాగ్రహాలు చేశాడు. 1924లో 'బహిష్కృత్ హితకారిని సమాజ్'ను స్థాపించాడు. 'మూక్ నాయక్' వంటి పత్రికల ద్వారా తన భావాలను వ్యాప్తి చేశాడు. కుల వ్యవస్థపై జీవిత కాల యుద్ధాన్ని ప్రకటించాడు. కుల నిర్మూలన (ఋజీజీజీ్ఛజ్ఞౌ ాజ ఇట్ట్హ) అనే పుస్తకంలో కుల నిర్మూలన జరిగితే కానీ అస్పృశ్యత అంతమవదని ప్రకటించాడు. చివరకు హిందూ మతాన్ని విడనాడి బౌద్ధాన్ని స్వీకరించాడు. రాజకీయంగా ఆయన పెద్దవిజయాలు సాధించనప్పటికీ ఆయన పరిజ్ఞానాన్ని, సామాజిక అభ్యునతి నిబద్ధతను గుర్తించి రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షుడిగా నియమించారు. రాజ్యాంగం ద్వారా ఆయన అంటరాని జాతులకు రిజర్వేషన్ కల్పించడమే కాకుండా అస్పృశ్యతను నిషేధించాలే చూశాడు.

1930ల నాటికి భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో దళితోత్యమ సంస్థలు పుట్టుకొచ్చాయి. ఇందులో మద్రాస్ రాష్ట్రానికి చెందిన ఆది ద్రావిడ, ఆది ఆంధ్ర సంఘాలు, ఉత్తర భారతదేశానికి చెందిన ఆది హిందు సభలు ప్రముఖమైనవి. దేశంలోని ఈ దళిత సంస్థలన్నీ సంయుక్తంగా కాంగ్రెస్ రాజకీయాలను అనేకమార్లు విమర్శించాయి. కాంగ్రెస్ 1928లో సైమన్ వ్యతిరేక ఆందోళన చేయగా, దళిత సంస్థలు సైమన్ సంఘాన్ని ఆహ్వానిస్తూ సమావేశాలు నిర్వహించాయి. ఈ సంస్థలన్నీ సంయుక్తంగా రౌండ్ టేబుల్ సదస్సుకు తమ ప్రతినిధిగా అంబేద్కర్‌ను ఎన్నుకున్నాయి.

1930లలో గాంధీ హరిజనోద్యమం ఎందరో దళితులను గాంధీవైపు, కాంగ్రెస్‌వైపు ఆకర్షించాయి. ఎందరో దళిత నాయకులు 30లలో కాంగ్రెస్ రాజకీయాల్లో నిమగ్నమై మంత్రి వర్గాల్లో కూడా పనిచేశారు. ఈ దశకంలోనే వెల్లువెత్తిన వామపక్ష ఉద్యమం కూడా దళితులను ఆకర్షించింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దళిత వర్గాల్లో అంబేద్కర్‌పై అభిమానం ఎక్కువగానే ఉన్నప్పటికీ రాజకీయంగా మాత్రం దళితులు కాంగ్రెస్ నీడనో, కమ్యూనిస్ట్ నీడనో చేరి దళితోద్యమాన్ని తాత్కాలికంగా పక్కదోవ పట్టించారు.

స్వాతంత్ర్యానంతరం రిజర్వేషన్ల వల్ల విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందిన కొత్త మధ్య తరగతి వర్గం దళితుల్లో భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లో వచ్చింది. రాజ్యాంగ రక్షణలు ఉన్నప్పటికీ దళితులపై ఆకృత్యాలు పెరగడం ఆ వర్గాలను కలచివేసింది. 1960లలో మహారాష్ట్రలో దళితోద్యమం కొత్త రూపాన్ని సంతరించుకుంది. దళిత పాంథర్ ఉద్యమం దేశ వ్యాప్తంగా దళితుల్లో తమ హక్కుల పట్ల ఆత్మగౌరవం పట్ల కొత్త చైతన్యాన్ని రగిల్చింది. క్రమంగా దళిత సాహిత్యం అన్ని భాషల్లోను పుట్టుకొచ్చి ఈ చైతన్యాన్ని ఎక్కువ చేసింది. 1980లలో 'బహుజన్ సమాజ్ పార్టీ' ఆవిర్భావం దళితుల రాజకీయ ఆకాంక్షలకు స్పష్టమైన రూపాన్ని ఇచ్చింది. కాన్షీరాం కృషి వల్ల ప్రధానంగా ఉత్తర భారతదేశంలో దళితుల్లో రాజకీయ చైతన్యం వెల్లివిరిసింది. ఎన్నో సంకీర్ణ రాజకీయాల ఫలితంగా బీఎస్పీ కొద్దికాలం కీలకమైన యూపీ రాష్ట్రంలో రాజకీయ అవసరాన్ని చేపట్టగలిగింది. తాజాగా దళితోద్యమంలో ఎన్నో సంక్లిష్ట వాదాలు, వివాదాలు పుట్టుకొచ్చాయి. వర్గీకరణ రాజకీయాలు ఆ ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావం చేస్తున్నాయి. దళిత ఉద్యమం దళితుల్లో అస్థిత్వ పోరాటాలనే గాక మిగతా సామాజిక వర్గాలను కూడా ప్రభావితం చేసి

వారిలో కూడా అస్థిత్వ వాద ఉద్యమాలు తలెత్తేలా చేయడం కొసమెరుపు.

**ప్ర: భారతదేశంలో స్వదేశీ సంస్థానాల విలీనాన్ని చర్చించండి?**

**జ:** బ్రిటిషర్లు భారత్‌ను విడిచి వెళ్లేనాటికి దాదాపు 560కి పైగా స్వదేశీ సంస్థానాలు బ్రిటిష్ సార్వభౌమాధికారాన్ని గుర్తిస్తూ ఉన్నాయి. అయితే స్వాతంత్ర్యం లభిస్తే తామూ స్వతంత్రులమవుతామనే ఆలోచన చాలామంది సంస్థానాధీశుల్లో కలిగింది. అయితే బ్రిటిషర్లు 1947 నాటికి సంస్థానాలు భారత్‌లోనో, పాకిస్థాన్‌లో విలీనం చేయాల్సుంటుందనే సంకేతాలు పంపారు. ఆ పరిస్థితుల్లో తాత్కాలిక ప్రభుత్వంలో కొత్తగా స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి దాన్ని వల్లభాయ్ పటేల్ పర్యవేక్షణలో ఉంచారు. పటేల్ బుజ్జగింపులు, బెదిరింపులతో ఆగస్టు 15, 1947లోగా భారత్‌లో చేరితే బాగుంటుందని ప్రకటించాడు. కొంత వాస్తవిక దృష్టి, కొంత దేశ భక్తితో వందల సంఖ్యలో సంస్థానాలు విలీనానికి సిద్ధపడ్డాయి. ఆగస్టు 15 నాటికి జునాగఢ్, కాశ్మీర్, హైదరాబాద్‌లు మాత్రం స్వతంత్ర్యంగా ఉండిపోయాయి. ఈ మూడు సంస్థానాలను కూడా తన దృఢ నిశ్చయంతో, వ్యూహ చతురతతో భారత్‌లో విలీనం చేశాడు.

**జునాగఢ్:**

జునాగఢ్, సౌరాష్ట్ర ప్రాంతంలో భౌగోళికంగా భారతదేశంలో అంతర్భాగంగా ఉంది. అయితే అప్పటి పాలకుడు ముస్లిం నవాబు ప్రజాభీష్టాన్ని పరిగణించకుండా పాకిస్థాన్‌లో విలీనమవుతున్నట్లు ప్రకటించాడు. దాంతో ప్రజలు తిరుగుబాటు చేశారు. నవాబ్ పాకిస్థాన్ పారిపోయాడు. దీంతో జునాగఢ్ దివాన్ షా నవాజ్ భుట్టో భారత ప్రభుత్వాన్ని ఆహ్వానించాడు. భారత సైన్యాలు జునాగఢ్‌లో ప్రవేశించాక 1948 ఫిబ్రవరిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపాడు. అందులో ఎక్కువ మంది ప్రజలు భారత్‌లో విలీనాన్నే ఆకాంక్షించారు.

**కాశ్మీర్:**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య భౌగోళికంగా చాలా కీలక స్థానంలో ఉన్న రాజ్యం. పాలకుడైన హరిసింగ్ అటు పాకిస్థాన్, ఇటు భారత్‌లో చేరకుండా స్వతంత్ర్యంగా ఉండేందుకు ప్రయత్నించాడు. అయితే పాకిస్థాన్ 1947 అక్టోబర్ 22న వాయవ్య ప్రాంతంలోని కొందరు గిరిజనులను రెచ్చగొట్టి కాశ్మీర్‌పై దాడికి పాల్పడింది. అక్టోబర్ 24న హరిసింగ్ భారత సాయాన్ని అర్థించాడు. అక్టోబర్ 26న హరిసింగ్ విలీన ఒప్పందంపై సంతకం చేయడంతో అక్టోబర్ 27న భారత సైన్యాలు కాశ్మీర్‌లోకి ప్రవేశించాయి. కానీ దురాక్రమణదారులు కాశ్మీర్‌లో కొంతభాగాన్ని తమ అదుపులో పెట్టుకోగలిగారు. 1947 డిసెంబర్‌లో భారత్, కాశ్మీర్ సమస్యను ఐక్యరాజ్య సమితికి నివేదించింది. పాశ్చాత్య దేశాలు పాకిస్థాన్ కొమ్ముకాస్తూ కాశ్మీర్ సమస్యను జటిలం చేశాయి. 1948లో భారత్, పాకిస్థాన్‌లు కాల్పుల విరమణ ఒప్పందంపై

సంతకాలు చేశాయి. 1951లో యూఎన్ఓ కాశ్మీర్‌లో రిఫరెండం జరపాలని తీర్మానించింది. అందుకు పాకిస్థాన్ తిరస్కరించింది. ఆ తర్వాత కాశ్మీర్‌లో ఎన్నోసార్లు ఎన్నికలు జరిపి కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని భారత్ ప్రకటించుకుంది.

**హైదరాబాద్:**

ఇక్కడ జనాభాలో ఎక్కువ మంది హిందువులు, నిజాం పాలనలో ఎన్నో రకాల వివక్షకు గురయ్యారు. నిజాం 1947 నవంబర్‌లో భారత్‌లో యథాస్థితి ఒప్పందం చేసుకున్నాడు. ఒక పక్క భారత ప్రభుత్వంతో చర్చలు చేస్తూనే విదేశాల నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకుంటూ భవిష్యత్‌లో భారత్‌ను ఎదిరించాలని నిజాం వ్యూహ రచన చేశాడు. ఈలోపు హైదరాబాద్ రాజ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రజాకార్ల దురాగతాలు, భారత్‌లో విలీనం కోసం హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమం చేయడం, కమ్యూనిస్టులు సాయుధ పోరాటాన్ని నిర్వహించడం జాతి దృష్టిని ఆకర్షించాయి. ఈ పరిస్థితుల్లో 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో పేరుతో భారత సైన్యాలు హైదరాబాద్‌లో ప్రవేశించాయి. నిజాం లొంగిపోయి నవంబర్‌లో విలీన ఒప్పందంపై సంతకం చేశాడు.

పటేల్ వందల సంఖ్యలో ఉన్న చిన్నచిన్న సంస్థానాలను బొంబాయి, మద్రాస్, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో విలీనం చేశాడు. మరికొన్నిటిని కేంద్రపాలిత ప్రాంతాలుగా ప్రకటించాడు. మరికొన్ని రాజ్యాలను ఐదు యూనియన్లుగా ఏర్పరిచాడు. అవి మధ్య భారత్, రాజస్థాన్, పెప్సో (పాటియాలా అండ్ ఈస్ట్ పంజాబ్ స్టేట్ యూనియన్), సౌరాష్ట్ర అండ్ ట్రావెన్‌కోర్, కొచ్చిన్. తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన సంస్థానాధీశులందరికీ పన్నులు లేకుండా శాశ్వత రాజభరణాలను ప్రకటించాడు. రాజరికం గౌరవాలను కొనసాగించేందుకు వారిని అనుమతించాడు.

సంస్థానాల విలీనం వల్ల పాకిస్థాన్‌కు మనం కోల్పోయిన భూభాగానికి పరిహారం లభించినట్లయింది. తన దృఢ నిశ్చయంతో ఈ విజయాన్ని సాధించిన పటేల్ ఇండియన్ బిస్మార్క్‌గా ఖ్యాతి గడించాడు.

**ప్ర: భారతదేశంలో వామపక్ష ఉద్యమాన్ని వివరించి, దాని ప్రభావాన్ని చర్చించండి?**

**జ:** రష్యా విప్లవం తర్వాత సామ్యవాద సిద్ధాంతం భారతీయులను విశేషంగా ఆకర్షించడం, 1920ల నుంచి కార్మిక, కర్షక ఉద్యమాలు తలెత్తడం, సహాయ నిరాకరణోద్యమ విరమణ తర్వాత గాంధీపై, కాంగ్రెస్‌పై అనుమానాలు పెరగడం భారతదేశంలో వామపక్ష ఉద్యమ ఆవిర్భావానికి దారి తీసిన అంశాలు.

కాంగ్రెస్‌లో సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూలు ఈ వామపక్ష ధోరణికి బలమైన ప్రతినిధులు. దేశవ్యాప్తంగా జరిగిన యువజన సదస్సులకు హాజరై సామ్యవాద భావాలను ప్రచారం చేశారు. కాంగ్రెస్‌లోకి కమ్యూనిస్టులను, సోషలిస్టులను ఆహ్వానించారు.

కాంగ్రెసేతర వామపక్ష ధోరణి సీపీఐ, సీఎస్‌పీ రూపంలో వ్యక్తమైంది. కాంగ్రెస్‌ను వామపక్షంవైపు మళ్లించే ప్రయత్నం చేస్తూనే సీపీఐ దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక ఉద్యమాలను నిర్మించింది. సీపీఐకి పెరుగుతున్న ఆదరణ చూసి ప్రభుత్వం పెషావర్, కాన్పూర్, మీరట్ కుట్ర కేసుల ద్వారా సీపీఐను అణచాలనుకుంది. అయితే కోమింటర్న్ సూచనల మేరకు సీపీఐ, కాంగ్రెస్‌ను బూర్జువా సంస్థ అని విమర్శిస్తూ జాతీయోద్యమానికి దూరమవడంతో దాని ప్రతిష్ట దిగజారింది. 1935 నుంచి సీపీఐ మళ్లీ కోమింటర్న్ సూచనల మేరకు కాంగ్రెస్‌కు దగ్గరై ఆంధ్ర, కేరళ, బెంగాల్, పంజాబ్ వంటి చోట్ల కార్మిక, కర్షకోద్యమాలను నిర్మిస్తూ తన ప్రతిష్టను పెంచుకుంది. హిట్లర్ రష్యాపై దాడి చేసినప్పుడు సీపీఐ ప్రపంచ యుద్ధాన్ని ప్రజల యుద్ధంగా వర్ణిస్తూ క్విట్ ఇండియా ఉద్యమానికి దూరమైంది.

శాసనోల్లంఘన ఉద్యమ విరమణ తర్వాత అసంతృప్తితో జయప్రకాశ్ నారాయణ వంటి నాయకులు 1934లో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని ఏర్పరిచారు. సీఎస్‌పీ తొలి నుంచీ జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించింది. దీని సభ్యులు వ్యవస్థాపరంగా కూడా కాంగ్రెస్ కమిటీల్లో కీలక పాత్ర పోషించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో సీఎస్‌పీ నాయకులు చురుగ్గా పాల్గొన్నారు. 1945-47 మధ్య అధికార బదిలీ కోసం జరిగిన చర్చలను సీఎస్‌పీ విమర్శించింది.

ఇంకా ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ వంటి సంస్థలు, ఎన్‌జీ రంగా, ఇందూలాల్ యాగ్నిక్ వంటి వ్యక్తులు వామపక్ష భావాలను ప్రచారం చేశారు.

వామపక్ష రాజకీయాలు కాంగ్రెస్ రాజకీయాలను కొంతమేర సానుకూలంగా ప్రభావితం చేశాయి. కాంగ్రెస్ నేతలు కరాచీ, ఫైజ్‌పూర్, సమావేశాల్లో కార్మిక, కర్షక హక్కులను సమర్థించడం జాతీయ ప్రణాళిక సంఘాన్ని ఏర్పర్చుకోవడం వామపక్షాల విజయమే. 1936-39 మధ్య వరుసగా నెహ్రూ, బోస్‌లు కాంగ్రెస్ అధ్యక్షులవడం వామపక్షాల విజయమే. వామపక్షాల కృషి వల్లే అభ్యుదయ రచయితల సంఘం, అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత మహిళా సదస్సు, ఆల్ ఇండియా స్టేట్స్ పీపుల్స్ కాన్ఫరెన్స్ వంటి సంస్థలు ఆవిర్భవించాయి. అయితే వామపక్ష నాయకులు కాంగ్రెస్‌పై తమ ఆధిపత్యాన్ని స్థాపించలేకపోయారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, నాయకత్వం, వ్యూహాలపై ఎంతో శక్తిని వృథా చేశారు. వామపక్షంలో సైద్ధాంతిక చీలికలు దానిని బలహీన పరిచాయి.

**ప్ర: భారతదేశంలో మతవాద పరిణామాన్ని, వృద్ధిని వివరించండి?**

**జ:** 19వ శతాబ్దంలో వలసవాద పాలన సృష్టించిన వెనుకబాటు తనం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఉన్న తీవ్ర పోటీ బ్రిటిషర్ల విభజించు, పాలించు విధానాలు మతతత్వ ధోరణికి కారణమయ్యాయి.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, అలీఘర్ ఉద్యమం ద్వారా ముస్లింలను, కాంగ్రెస్ నాయకుల నుంచి దూరం చేయాలని ప్రయత్నించాడు. ముస్లింలకు రాజకీయాలు అక్కర్లేదని హిందువులకు దీటుగా విద్య, ఉద్యోగ అవకాశాలు పెంచుకోవాలని అందుకోసం బ్రిటిషర్లకు విధేయంగా ఉండాలని వాదించాడు. 1888 నుంచి ఆయన హిందువులు, ముస్లింల ప్రయోజనాలు వేరని వారు ప్రత్యేక జాతులని వాదించాడు.

రాజకీయంగా జాతీయోద్యమాన్ని దెబ్బకొట్టడానికి ముస్లింలను వాడుకోవచ్చని భావించిన బ్రిటిష్ ప్రభుత్వం అలీఘర్ ఉద్యమాన్ని ప్రోత్సహించింది. అలీఘర్ ఉద్యమానికి సమాంతరంగా హిందూ మతతత్వ ధోరణి కూడా మొదలైంది. ఈ ధోరణి 1870లలో ఉర్దూ వ్యతిరేక ఉద్యమాల్లోను, 1890లలో గోవధ నిషేధ ఉద్యమంలోనూ ప్రతిబింబించింది.

స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన నేపథ్యంలో బ్రిటిషర్లు ముస్లింలకు ఒక రాజకీయ సంస్థ ఉండాల్సిన అవసరాన్ని గుర్తించడంతో 1906 డిసెంబర్‌లో ప్రభుత్వ తోడ్పాటుతో ముస్లిం లీగ్ స్థాపన జరిగింది. ముస్లిం లీగ్ బెంగాల్ విభజనను సమర్థిస్తూ మతతత్వ ధోరణిని రెచ్చగొట్టింది. ముస్లింల ప్రయోజనం కోసమే విభజన అని కర్జన్ ప్రచారం చేశాడు. స్వదేశీ ఉద్యమం బాగా సాగుతున్నప్పుడు బెంగాల్‌లో మత ఘర్షణలు తలెత్తాయి.

1909లో పంజాబ్ హిందూ సభ ఆవిర్భవించింది. ఈ సంస్థ నాయకులు యు.ఎన్.ముఖర్జీ, లాల్‌ఛంద్, కాంగ్రెస్‌ను దుమ్మెత్తిపోశాను. 1915లో స్థాపించిన హిందూ మహాసభ మతతత్వ రాజకీయాలకు పాల్పడింది. 1909లో బ్రిటిషర్లు ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించడం మతతత్వ రాజకీయాలను బలపర్చింది. అయితే 1912 నుంచి లీగ్ ప్రాబల్యంలోకి వచ్చిన యువతరం, ప్రపంచయుద్ధ కాలంనాటి పరిస్థితులు లీగ్‌ను కాంగ్రెస్‌కు దగ్గర చేశాయి. 1916లో లక్నో ఒప్పందం ద్వారా కాంగ్రెస్ ప్రత్యేక నియోజక వర్గాలను ఆమోదించడం దీర్ఘకాలికంగా మతతత్వ రాజకీయాలకు లాభించింది.

సహాయ నిరాకరణోద్యమ కాలంలో ఖిలాఫత్ అంశాన్ని తీసుకోవడం వల్ల ముస్లింలలో మత సంబంధ రాజకీయ చైతన్యమే వచ్చింది. ఈ సమయంలో ఖిలాఫత్ నాయకులు 'ఫత్వా'లను రాజకీయంగా వాడుకోవడంతో సనాతన శక్తులు బలపడ్డాయి. ఖిలాఫత్ ఉద్యమం తర్వాత ముస్లింలలో లౌకిక రాజకీయ చైతన్యాన్ని పెంచేందుకు కాంగ్రెస్ కృషి చేయలేదు.

1922–27 మధ్య జాతీయోద్యమం క్రియా రహితంగా ఉండటం వల్ల మతతత్వ రాజకీయాలు బలపడ్డాయి. ఆ కాలంలో 112 మత సంఘర్షణలు జరిగాయి. స్వరాజ్ పార్టీలో హిందూ ప్రయోజనాలను కాపాడాలంటూ రెస్పాన్సినిస్టులు తయారయ్యారు. ఈ దశలోనే లాలా లజపతిరాయ్, మదన్‌మోహన్ మాలవ్యా, ఆలీ సోదరులు, ఎం.ఎ. జిన్నా మతతత్వ వాదులుగా మారారు. 1928లో నెహ్రూ నివేదికకు జిన్నా ప్రతిపాదించిన సవరణలు హిందూ మహాసభ వంటి సంస్థల ఒత్తిడి వల్ల ఆమోదం కాలేదు. దీంతో జిన్నా కాంగ్రెస్‌కు పూర్తిగా దూరమై 14 మతతత్వ డిమాండ్లను రూపొందించారు.

1937 ఎన్నికల్లో లీగ్ ఘోరంగా దెబ్బతింది. అయితే కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిపి సంకీర్ణాల ఏర్పాటుకు జిన్నా ప్రయత్నాలు విఫలమవడంతో జిన్నాలో కాంగ్రెస్ పట్ల అసహనం ఎక్కువైంది.

1937 ఎన్నికల్లో మతతత్వ శక్తులు ఘోరంగా దెబ్బతినడంతో వారు తీవ్ర మతతత్వ ధోరణిని ప్రదర్శించసాగారు. అన్యమత విద్వేషాన్ని ప్రచారం చేశారు. జిన్నా ముస్లిం లీగ్‌ను పునర్వ్యవస్థీకరించి ముస్లిం సమాజంలో దాని ప్రాతిపదికను విస్తరించాడు. అదే సమయంలో కాంగ్రెస్ ముస్లిం

ప్రజానీకంలోకి వెళ్లాల్సిన అవసరాన్ని నిర్లక్ష్యం చేసింది. 1940లో లాహోర్‌లో సమావేశమైన ముస్లిం లీగ్ పాకిస్థాన్ తీర్మానాన్ని చేసింది. అదే సమయంలో హిందూ మహాసభకు అధ్యక్షుడిగా ఉన్న వి.డి. సావర్కర్ హిందూ రాష్ట్రం అనే భావవను ప్రచారం చేశాడు. ఆర్.ఎస్.ఎస్., ఎం.ఎస్ గోవాల్కర్ నాయకత్వంలో ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది.

యుద్ధానంతరం జరిగిన రాజ్యాంగ చర్చలన్నింటిలోను జిన్నా మొండి వైఖరి ప్రదర్శించాడు. తమ పాలన కొనసాగేందుకు ముస్లిం మతతత్వ వాదాన్ని ఒకసాకుగా వాడుకోవాలనుకున్న బ్రిటిష్ వైఖరిని జిన్నా తనకు అనుకూలంగా మలచుకున్నాడు. క్రిప్స్ రాయబారం (1942)లో పాకిస్థాన్ ప్రస్తావన లేదని జిన్నా తిరస్కరించాడు. వేవేల్ సిమ్లా సదస్సును 1945లో నిర్వహించినప్పుడు వైస్రాయ్ కార్య నిర్వహక మండలిలోని ముస్లిం సభ్యులందరూ లీగ్ ద్వారానే నామినేట్ కావాలని జిన్నా వాదించి ప్రతిష్టంభన సృష్టించాడు. కేబినెట్ మిషన్ (1946) ప్రణాళికను తొలుత ఆమోదించిన జిన్నా తర్వాత దాన్ని తిరస్కరిస్తూ 1946 ఆగస్టు 16న ప్రత్యక్ష చర్య దినానికి పిలుపునిచ్చాడు. హిందూ మతతత్వ శక్తులు కూడా రెచ్చిపోవడంతో మత కల్లోలాలు జరిగి దేశ వ్యాప్తంగా అయిదు వేల మంది మరణించారు. తాత్కాలిక ప్రభుత్వం ద్వారా పరిస్థితులు మెరుగు పరచాలనే ప్రయత్నం కూడా లీగ్ వైఖరి వల్ల విఫలమైంది. ఈ పరిస్థితుల్లో భారతదేశానికి వచ్చిన మౌంట్ బాటన్ దేశ విభజన, స్వాతంత్ర్యాలను ప్రతిపాదించాడు.

**ముఖ్య ప్రశ్నలు:**

- సింధు నాగరికత పతనాన్ని వివరించి, వారసత్వాన్ని విశ్లేషించండి?
- జైన, బౌద్ధ మతాల ఆవిర్భావానికి గల కారణాలు చర్చించండి?
- గాంధార, మధుర, అమరావతి శైలుల్ని విశదీకరించండి?
- ఇండో-ఇస్లామిక్ సంస్కృతిని చర్చించండి?
- వాస్తు, సంగీత, చిత్రలేఖన కళలు మొఘలుల కాలంలో ఎలా వికసించాయో వివరించండి?
- శివాజీ ఎదుగుదలకు గల భౌగోళిక, సాంస్కృతిక నేపథ్యాన్ని విశ్లేషించండి?
- మితవాదులు, అతివాదులకు మధ్యగల తేడాలను వివరించి, జాతీయోద్యమంలో వారి పాత్రను చర్చించండి?
- 1857 తిరుగుబాటు స్వభావాన్ని, ప్రభావాన్ని అంచనా వేయండి?
- గాంధేయ దశ (1920-47)లో జాతీయోద్యమ పురోగతిని పరిశీలించండి?
- 19వ శతాబ్దంలో సాంఘిక, మత సంస్కరణోద్యమాల పాత్రను అంచనా వేయండి?
- జస్టిస్ పార్టీ పనితీరును విమర్శనాత్మకంగా పరిశీలించండి?
- దళితుల పురోగతి కోసం పూలే, నారయణగురు, అంబేద్కర్, గాంధీ చేసిన కృషిని చర్చించండి?
- దేశ విభజనకు దారి తీసిన పరిస్థితులను చర్చించండి?
- ఆధునిక భారతదేశంలో మహిళోద్యమ ప్రస్థానాన్ని విశ్లేషించండి?